

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానంకు మద్దతుగా ప్రచారం..



ప్రచారాన్ని విస్తృతం చేయాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఎన్నికల గడువు సమీపిస్తున్నందున ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రజల నుంచి వస్తున్న స్పందన గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలకు మరో 9 రోజులు మాత్రమే గడువు ఉన్నందున ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. 'దొంగ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఏవిధంగా మోసం చేసిందో.. ? చెప్పాలన్నారు'. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో అభ్యర్థి పద్మారావుకు రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుందని, ప్రచారంలో బ్రహ్మరథం పడుతున్నారని వివరించారు. కేంద్రమంత్రిగా నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండని కిషన్‌రెడ్డిపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అభిప్రాయపడ్డారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కోసం పాటుపడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారని, పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జబ్బార్ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన కేటీఆర్ రోడ్‌షోకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారన్నారు. కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, మల్లికార్జున్‌గౌడ్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, పవన్‌కుమార్‌గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్‌గౌడ్, ఏసూరి మహేష్, అశోక్ యాదవ్, శ్రీహరి, కిషోర్, నాగులు, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్‌ఎస్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



మాణికేశ్వర్‌నగర్ సమస్యలు తీర్చే బాధ్యత నాది: సీఎం

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్‌ను గెలిపిస్తే తార్నాక డివిజన్ ఓయూ క్యాంపస్ పక్కనే ఉన్న మాణికేశ్వర్‌నగర్ (వడ్డెర బస్తీ) సమస్యలు తీర్చే బాధ్యత నాది అని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్ సీతాఫల్‌మండి, చిలకలగూడ ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాణికేశ్వర్‌నగర్ వాసులు తమకు ప్రభుత్వ ఆస్పత్రి కావాలంటూ దాదాపు 150 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గత ప్రభుత్వం ఈ సమస్య ను పరిష్కరించలేకపోయిందని, స్థానిక నేతలు ఆరోపించారు. ఆదం సంతోష్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డిలు ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం తమ సమస్యలపై స్పందించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



ఎరుకలబస్తీలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ నేతృత్వంలో బీఆర్‌ఎస్ శ్రేణులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిలకలగూడ, ఎరుకలబస్తీ, బడేమసీదు, వేంకటేశ్వర నగర్, మార్కండేయనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటువేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నీళ్ల, కరెంట్ సమస్యలు మొదలయ్యాయని విమర్శించారు. ఈసారి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్‌ను గెలిపించండి

రసూల్‌పురా: ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటువేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ కోరారు. శనివారం 3వ వార్డులో మాట్లాడుతూ.. మే13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. మల్కాజిగిరి, కంటోన్మెంట్ ప్రాంతాలపై సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉందని ఇరువురు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు.

ప్రశాంతంగా హోం ఓటింగ్



ఇంటి వద్దే ఓటేసిన లక్ష్మమ్మ

సనత్‌నగర్: పోలింగ్ శాతాన్ని పెంచే దిశగా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు శనివారం సనత్‌నగర్ నియోజకవర్గంలో హోం ఓటింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 11 మంది వయోవృద్ధులు, దివ్యాంగులు ఉండగా.. పోలింగ్ అధికారులు వారి వద్దకు వెళ్లి ఓటు వేయించారు. ఎన్నికల అధికారులు ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించిన ఎన్నికల అధికారులకు వయోవృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన 86 ఏళ్ల లక్ష్మమ్మ శనివారం ఇంటినుంచే లోకసభ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. 86 ఏళ్లలో సైతం తాను ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

◆ భారత ఎన్నికల సంఘం తొలిసారిగా వృద్ధులు, వికలాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం గత కర్ణాటక ఎన్నికల సందర్భంగా ప్రారంభించింది. ఇటీవల తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు వేశారు.

ఓయూ సివిల్ అకాడమీ సందర్శన

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్య ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం ఓయూ సివిల్ అకాడమీని సందర్శించారు. శనివారం వీసీ రవీందర్‌తో కలిసి ఓయూ, బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఉచిత కోచింగ్ సెంటర్‌కు హాజరై తరగతుల నిర్వహణ, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్న ఓయూ సివిల్ అకాడమీకి అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. ఓయూ సివిల్ అకాడమీ డైరెక్టర్ ప్రొ.కొండ నాగేశ్వర్‌రావు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

రాంగోపాల్‌పేట్: అధిక ఎండలతో వేడి నుంచి బాటసారులు సేద తీరేందుకు రాణిగంజ్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. వాహనదారులు, బాటసారులు దాహార్తితో ఇబ్బందులు పడుతున్నందును మజ్జిగతో పాటు నిమ్మరసం, కూల్ డ్రింక్స్, పండ్ల రసాలు ఒక్కో రోజు ఒక చల్లని పానియాలను అందుబాటులో ఉంచుతూ.. తమ మానవత్వాన్ని చాటుతున్నారు.

విజేతలను అందించేందుకే శిక్షణ శిబిరాలు



గ్రాండ్ మాస్టర్స్ కోచింగ్ క్యాంప్ ప్రారంభోత్సవం

సనత్‌నగర్: చెస్ క్రీడలో విశ్వ విజేతలను అందించేందుకు శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదం చేస్తాయని సామాజికవేత్త, కొల్లాపూర్ రత్నగిరి ఫౌండేషన్ వైస్ చైర్మన్ అరుణ్ జూపల్లి అన్నారు. ఇండియన్ చెస్ మాస్టర్స్, ఏకగ్రా చెస్ అకాడమీలు సంయుక్తంగా బేగంపేట పాటిగడ్డలోని ఇండియన్ చెస్ మాస్టర్స్ సెంటర్‌లో గ్రాండ్ మాస్టర్స్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ శిబిరాలను నిర్వహించడం ద్వారా పిల్లలు, విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణనిచ్చి భవిష్యత్తు తరాలను గ్రాండ్ మాస్టర్లుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. భారతీయులు కనిపెట్టిన చదరంగం క్రీడ ప్రపంచంలో తెలివైన ఆటగా ప్రసిద్ధికెక్కిందని పేర్కొన్నారు. చెస్‌తో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకశక్తి పెరుగుతాయన్నారు. చెస్ ట్రైనర్, 13వ ఇండియన్ గ్రాండ్ మాస్టర్ దీపన్ చక్రవర్తి, ఇండియన్ చెస్ మాస్టర్స్ కోచ్ చైతన్య సురేష్, ఏకగ్రా చెస్ అకాడమీ సీఈఓ సందీప్ నాయుడు, యువ నటుడు మహ్మద్ సోహేల్, యువ చెస్ క్రీడాకారిణి అన్నయ రంగినేని, స్రవంతి గుమ్మడి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

కంటోన్మెంట్: బీఆర్‌ఎస్ తరపున బోర్డు ఎన్నికల్లో పోటీచేసిన పెద్దాల నర్సింహ, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డిలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు షాక్‌కు గురయ్యాయి. పెద్దాల నర్సింహ ఏఐసీసీ పరిశీలకులు విష్ణు, మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనిపై నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిలు సమావేశం ఏర్పాటు చేసి స్పందించడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ తమ నేతలు బెదిరిస్తూ పార్టీలో చేర్చుకుంటోందంటూ.. ఆరోపించారు. తామెవరినీ బెదిరించడం లేదని, ఆయా నేతలే స్వచ్ఛందంగా తమ పార్టీలోకి వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బదులిచ్చారు. 8వ వార్డుకు చెందిన ఉద్యమకారుడు పీడీ అశోక్‌కుమార్ సైతం కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లోకి శ్రీశైలం..

సనత్‌నగర్: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బేగంపేట మోతీలాల్‌నెహ్రూనగర్‌కు చెందిన ఆయన శనివారం వేణుగోపాలచారితో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ అమలుచేస్తున్న గ్యారంటీలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని ఈ సందర్భంగా శ్రీశైలం తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.



మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నేతలు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కంటోన్మెంట్‌లో కాంగ్రెస్‌దే విజయం



పల్లె లక్ష్మణ్ గౌడ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం ఖాయమని నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జ్ పల్లె లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్ ప్రజలు అభివృద్ధి కాంక్షిస్తున్నారన్నారు. కంటోన్మెంట్ స్థానికుడిగా తనకు ఇక్కడి సమస్యలు, ప్రజల నాడిపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. 30 ఏళ్లుగా ఒక్కసారి మినహా పాతికేళ్ల ఒకే కుటుంబ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉండటంతో ప్రజలు ఆ పార్టీని ఆదరించారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలతో పాటు కంటోన్మెంట్ వాసులకు అదనంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారన్నారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం, ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన బస్తీ వాసులకు పట్టాలు ఇస్తామన్న హామీలతో ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. ఇటీవల పదుల సంఖ్యలో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో చేరుతుండటం తమ విజయానికి సంకేతమన్నారు.

వినతిపత్రం అందజేత



పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: హైదరాబాద్ జిల్లాలో విద్యా స్థితిగతులను మెరుగుపరచాలని కోరుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు శనివారం ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చి 15 ఏళ్లు గడిచినా రాష్ట్ర విద్యావ్యవస్థ మెరుగుపడటం లేదన్నారు. ప్రభుత్వ సంస్థల నివేదికల ప్రకారం మౌలిక వసతుల కల్పన, బోధన, బోధనేతర సిబ్బంది కొరత, ప్రైవేటు పాఠశాలలో ఫీజుల నియంత్రణ, తరగతికి తగిన విద్యా సామర్థ్యాల సాధనలో దేశంలో అన్ని రాష్ట్రాలకంటే కూడా వెనుకబడి ఉన్నామన్నారు. ఈ పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని కోరామన్నారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి వివి.రావు, ఎంవీ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ ఏవీఎం. స్వామి, కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో టమాటా రూ.19, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండకాయ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 18 గా ఉన్నాయి.

సందడిగా కళాశాల ఫేర్‌వెల్ డే



సనత్‌నగర్: హిందూ మహిళా కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు శనివారం సందడిగా జరిగాయి. డిగ్రీ పూర్తి చేసుకుని వెళ్తున్న సీనియర్ విద్యార్థినులకు జూనియర్లు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వివిధ కోర్సులకు చెందిన విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భరతనాట్యం, పాశ్చాత్య నృత్యాలు, నాటకాలు, హాస్యోక్తులతో విద్యార్థులు అలరించారు. మిస్ ఫేర్‌వెల్ కోసం పెట్టిన పోటీలో విద్యార్థిని శివాని మిస్ ఫేర్‌వెల్‌గా ఎంపికైంది. స్వామి వివేకానంద సేవా సమితి ట్రస్ట్ కార్యదర్శి హెచ్‌ఎస్ త్రిపాఠి, కళాశాల ప్రతినిధులు డాక్టర్ రీమ, శర్మలతో పాటు హిందూ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఉగాది పురస్కారాలు



సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాలకు ఎంపికైన మరో ఇద్దరికి శనివారం అవార్డులు ప్రదానం చేశారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్స్ సుజాతమ్మ, సురేందర్‌నాయిలకు ఉగాది పురస్కారాలను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి ప్రదానం చేశారు.

సీడీ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రాజ్యాంగం మార్పుపై రాసిన పాటల సీడీని ఆవిష్కరించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అంసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి అధ్యక్షతన పాటల సీడీని విడుదల చేశారు. ఈ పాటను కేతఆర్ బీమసేన రచించిగా గ్యాదరి జగన్ పాడారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

లాలాపేట: సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి దానం నాగేందర్, మల్కాజిగిరి నుంచి సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సబ్బండ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బాసుగల కొమురయ్య అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలిస్తే, రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు ఎస్సీ ఎస్టీ, మైనార్టీల రిజర్వేషన్లు రద్దవుతాయని ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధానిగా కావడం ఖాయమని అందుకే తెలంగాణలోని అత్యధిక ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలువాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి ప్రమాదకరమైన బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలనీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఆయన పిలుపునిచ్చారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం



పద్మారావునగర్: గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బోయిగూడ ఫ్లోరా హోటల్ సమీపంలోని పుట్‌పాత్‌పై ఓ వ్యక్తి (30) అపస్మారక స్థితిలో పడి ఉన్నారనే సమాచారం మేరకు గాంధీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడి వివరాల తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. వివరాలకు 87126 61248, 040–27853585.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

మాజీ మేయర్ కార్తీకరెడ్డి

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ పెద్ద ఎత్తున మే13న పాల్గొనాలని బీజేపీ నాయకురాలు, మాజీ మేయర్ కార్తీకరెడ్డి అన్నారు. శనివారం తార్నాకలో ఓటర్లకు బొట్టు పెట్టి కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని తెలిజేసే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రధాని నరేంద్రమోదీ దేశానికి సమర్థవంతమైన పాలకుడని బీజేపీని మరోసారి గెలిపించాలన్నారు. ఇన్‌చార్జి అమరేందర్‌రెడ్డి, లక్ష్మణ్, తార్నాక డివిజన్ అధ్యక్షులు రామువర్మ, అనిత, అనూష, సత్యవతి, తదితరులున్నారు.

ప్రవాసీయులు బాధ్యతగా ఓటు వేయాలి..

రసూల్‌పురా: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రవాసీయులు తమ బాధ్యతగా ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలంగాణ ప్రవాసీ సమాజ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సుభాష్ అగర్వాల్ సూచించారు. శనివారం గన్‌రాక్ గార్డెన్‌లో ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు ప్రతి ఒక్కరూ పోలింగ్ రోజు తప్పనిసరి ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. రాత్రి 7 గంటలకు గన్‌రాక్ గార్డెన్‌లో ప్రవాసీయుల ఓటుహక్కు వినియోగంపై సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

'మోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయం

సనత్‌నగర్: దేశమంతా బీజేపీ పవనాలు వీస్తున్నాయని, ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు మర్రి పురురవరెడ్డి అన్నారు. బేగంపేటలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో మెజార్టీ స్థానాలను బీజేపీ గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన ప్రధాని..

బౌద్ధనగర్: ప్రపంచంలో అత్యంత ఆదరణ కలిగిన ప్రధాని మోదీని మరోసారి ప్రధానిని చేయాల్సిన బాధ్యత దేశ పౌరులందరిపై ఉందని రాజస్థాన్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తారాచంద్ పిలుపునిచ్చారు. శనివారం బౌద్ధనగర్‌లో ఆయన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. దేశంకోసం, ధర్మం కోసం నిరంతరం సేవ చేస్తూ.. ప్రపంచంలోనే ఎన్నో నిర్ణయాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు, రవిప్రకాష్‌గౌడ్, బండ కార్తీకరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి, పోచయ్య, సతీష్, హనుమంతు పాల్గొన్నారు.


సామూహిక సీమంతాలు



శ్రీమాతా సేవా సమితి ఆధ్వర్యంలో సీమంతాలు చేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్‌లోని శ్రీమాతా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మోడల్‌కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీహాల్‌లో మహిళలకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. సమితి అధ్యక్షురాలు కుసుమ విజయ ఆధ్వర్యంలో 30 మంది పేద మహిళలకు సీమంతాలు చేసి చీర, పసుపుకుంకుమ, గాజులు, పండ్లు పెట్టి సన్మానించారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై హేమలత, హైకోర్టు సీనియర్ న్యాయవాది రాజేశ్వరి, అమీర్‌పేట యూపీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న, జీహెచ్‌ఎంసీ యూసీడీ అధికారి బుచ్చమ్మలు హాజరై మాట్లాడారు. విశ్వంలో కల్తీలేని ప్రేమ అంటే ఒక్క అమ్మ ప్రేమ మాత్రమేనన్నారు. ప్రతి ఒక్కరికీ ఆది గురువు తల్లి మాత్రమేనని అలాంటి తల్లిని జీవితాంతం గౌరవించాలన్నారు. సంఘ సేవకులు వసంత, శోభ వెంకటపతి, శ్రీమాతా సేవా సమితి ప్రతినిధులు కుసుమ జ్యోతి, రాధిక, భారతమ్మ, రాజి, కల్పన, ఆశావర్కర్లు, నర్సులు పాల్గొన్నారు.

బీజేపీ బహిరంగ సభకు ఏర్పాట్లు..





రసూల్‌పురా: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు (ఆదివారం) సాయంత్రం ఐదు గంటలకు పరేడ్‌మైదానంలో నిర్వహించే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి, కంటోన్మెంట్ మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్‌బీనగర్, మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేసి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీవీఐపీ వేదిక, వీఐపీల జర్మన్ టెంట్ల వేదికలతో పాటు ముఖ్య నాయకులు కార్యకర్తలు కూర్చునేందుకు కుర్చీలు వేస్తున్నారు. వేదికల మధ్య బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.